
మంత్రి నాదెండ్ల మనోహర్ నేడు కాకినాడ రాక

పెళ్లి పేరిట రూ.6 లక్షలకు టోకరా

» మహిళ, మరో 11 మందిపై డీఆర్వోకు ఫిర్యాదు



వైసీపీ నేత.. కోట్లలో మేత!

కొమరగిరి లేఅవుట్

- కొమరగిరి ఇళ్ల స్థలాల లేఅవుట్ కుంభకోణంపై విచారణ జరిగేనా
- పేదల ఇళ్ల స్థలాల కొనుగోలు పేరుతో గత ప్రభుత్వంలో భారీ స్కాం
- రూ.58కోట్లు పలికే 250ఎకరాల కారుచౌక భూములకు రూ.112కోట్లు చెల్లింపు
- ఎకరం రూ.23లక్షలకు కొని ప్రభుత్వానికి రూ.45లక్షలకు అంటగట్టిన వైసీపీ నేతలు
- ముందే రైతుల నుంచి భూకొనుగోలు ఒప్పందం కుదుర్చుకుని ఆ తర్వాత సేకరణ
- తెరవెనుక చక్రం తిప్పిన అప్పటి కాకినాడ సిటీ వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి
- అప్పటి కలెక్టర్‌ను అడ్డుపెట్టుకుని చదును పేరుతోను రూ.35కోట్లకుపైగా పిండుడు
- కూటమి ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో అక్రమాలపై విచారణ చేయాలని డిమాండ్లు
- దీనిపై దర్యాప్తు చేయాలని ఇప్పటికే కలెక్టర్‌ను కోరిన టీడీపీ ఎమ్మెల్యే కొండబాబు
- మొత్తం 13,551 ఇళ్లకు మూడున్నరేళ్లలో పూర్తయినవి వెయ్యిలోపే..

ఒకటికాదు.. రెండు కాదు.. ఏకంగా 250 ఎకరాలు. ఎకరా రూ.23 లక్షలకు దొరుకుతుంటే అంత కారుచౌకగా ప్రభుత్వానికి ఎందుకు ఇవ్వడం అని అప్పటి వైసీపీ కాకినాడ కీలక నేత భావించారు. విషయం చెప్పకుండా ముందుగానే రైతులవద్ద తక్కువ ధరకు భూములు కొనేశారు. ఆనక అవే భూములను ఎకరాకు రూ.47లక్షలకు ప్రభుత్వానికి అమ్మారు. ఈ క్రమంలో రూ.58కోట్లు పలికే భూములకు సర్కారునుంచి రూ.112కోట్లు పిండేశారు. అధికారం అడ్డం పెట్టుకుని, అప్పటి కలెక్టర్ సహకారంతో గత వైసీపీ పాలనలో సదరు నేత భారీగా దోచేశారు. భూముల చదును పేరుతోను రూ.35కోట్లకుపైగా దండేశారు.

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి మండలం కొమరగిరి పేదల ఇళ్ల స్థలాల లేఅవుట్ ముసుగులో గత ప్రభుత్వ పెద్దలు కోట్లలో లబ్ధి పొందారు. ఈ కుంభకోణం గురించి తెలిసినా అప్పటి సీఎం కార్యాలయం నోరు మెదపలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొమరగిరి భూకొనుగోలు, చదును కుంభకోణంపై దర్యాప్తు జరగాలనే డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే దీనివెనుక భాగోతంపై విచారణ చేపట్టాలని కాకినాడ సిటీ టీడీపీ ఎమ్మెల్యే కొండబాబు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

అడ్డంగా బొక్కేశారు..

పేదల ఇళ్లస్థలాల పథకం పేరుతో గత వైసీపీ ప్రభుత్వం కాకినాడ జిల్లావ్యాప్తంగా 3,84,218మంది లబ్ధిదారులను గుర్తించింది. వీరందరికీ 7,218 ఎకరాలు కావాల్సి ఉండగా, 1,856 ఎకరాల ప్రభుత్వ భూమి పోను మిగిలిన 5,362 ఎకరాలను రూ.2,566 కోట్లతో రైతులనుంచి కొనుగోలు చేశారు. వీరందరికీ 2020, డిసెంబరు 25న అప్పటి సీఎం జగన్ కొమరగిరి వచ్చి పథకం ప్రారంభించి పట్టాలు పంపిణీ చేయించారు. కాకినాడ సిటీ పరిధిలో ఇళ్లు లేని 16వేలమంది లబ్ధిదారులకు నగరంలో స్థలాలు లేకపోవడంతో దూరంగా అయినా ఇవ్వాలని అప్పటి కలెక్టర్ మురళీధరరెడ్డి, కాకినాడ సిటీ వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి నిర్ణయించారు. ఇందులో భాగంగా యు.కొత్తపల్లి మండలం కొమరగిరి స్థలాలు బాగుంటాయని సదరు ద్వారంపూడి ప్రతిపాదించారు. 16వేలమందికి 350ఎకరాలు అవసర మని అధికారులు తేల్చారు. ఇందులో ప్రభుత్వ భూమి పోను 250ఎకరాలు ప్రైవేటుగా సేకరించాల్సి ఉందని నిర్ధారించారు. ఇక్కడే అసలు కథ నడిచింది. కొమరగిరి ప్రాంతం సముద్రతీరానికి అతి సమీపంలో ఉన్న ప్రాంతం. భారీ వర్షాలు వస్తే ఈ భూములన్నీ ముంపునకు గురవుతాయి. సముద్రంలో కలిసే నీరు కూడా ఈ స్థలాల్లోకే వస్తాయి. ఈ భూములు తక్కువ ధరకే వస్తుండడంతో ద్వారంపూడి, ఆయన అనుచరులు రంగంలోకి దిగారు. అసలు విషయం చెప్పకుండా వేరే అవసరాల పేరుతో ఎకరం రూ.23లక్షలకు కొనుగోలు చేశారు. ఈ భూములకు పెద్దగా డిమాండ్ లేకపోవడంతో రైతులు కూడా భూములు ఇవ్వడానికి ముందుకు వచ్చారు. ఈ క్రమంలో సదరునేత, ఆయన అనుచరులు రైతులకు పూర్తిగా డబ్బులు చెల్లించకుండా కేవలం అడ్వాన్స్‌లే ఇచ్చారు. ఆ తర్వాత ద్వారంపూడి ఆదేశాలతో అప్పటి కలెక్టర్ మురళీధర రెడ్డి భూసేకరణకు ఆమోదం తెలిపారు. మార్కెట్ ధర రూ.45లక్షల వరకు ఉందని లెక్కగట్టి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.దీంతో రూ.112కోట్ల వరకు చెల్లింపులు జరిగాయి. రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యాక వాటిలో సగం డబ్బు సదరు నేత, ఆయన అనుచరులు లాగేసుకున్నారు. రూ.58కోట్లు పలికే 250 ఎకరాలకు ప్రభుత్వం నుంచి రూ.112కో ట్లు చెల్లింపులు చేయించారు. ఈ ముసుగులో సదరు నేత భారీగా లబ్ధి పొందారు. ఇదంతా ప్రణాళిక ప్రకారం జరిగినా అధికారులు, కలెక్టర్ సైతం ఆ నేతకే సహకరించారు. ఇలా వచ్చిన లాభాల్లో తలా కొంత పంచుకున్నారు.

చదును పేరుతో చుట్టేశారు..

సీఎం జగన్ కొమరగిరి లేఅవుట్ నుంచే పేదల ఇళ్ల పథకం ప్రారం భించారు. దీంతో ఇక్కడ లేఅవుట్ పనులు వేగంగా పూర్తిచేయడంపై అప్పటి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. కోట్లకు కోట్లు కుమ్మరించింది. అసలే కొమరగిరి భూములు పూర్తిగా లోతట్టు ప్రాంతంలో ఉండడం, ముంపు భయం ఎక్కువగా ఉండడంతో 350ఎకరాల లేఅవుట్‌ను చదును చేయడానికి రూ.125కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఆరు అడుగులకు మించి చదును చేయాలని నిర్ణయించారు. ఇక్కడే సదరు ద్వారంపూడి చక్రం తిప్పారు. ఎలాగూ భూముల కొనుగోలులో భారీగా మింగేయడమే కాకుండా చదును కాంట్రాక్టు కూడా తనే నొక్కేశాడు. అప్పటి పిఠాపురం వైసీపీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు మోకాలడ్డే ప్రయత్నం చేసినా ద్వారంపూడి సీఎం జగన్‌కు సన్నిహితుడు కావడం, కలెక్టర్ మురళీధరరెడ్డి కూడా ద్వారంపూడి మనిషి కావడంతో చదును కాంట్రాక్టు కూడా ఈయనకే ఇచ్చేశారు. అటు చదునుకు కావాల్సిన గ్రావెల్‌ను పోలవరం కాలువల దగ్గరనుంచి పెద్దాపురం రామేశం మెట్ట వరకు రేయింబవళ్లు తన మనుషులతో ద్వారంపూడి తరలించారు. సీఎం ప్రాధాన్య ప్రాజెక్టు పేరుతో గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు లేకుండానే, గనులశాఖకు రాయల్టీ చెల్లించకుండానే రామేశంమెట్టనుంచి కోట్ల క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌ను వేల టిప్పర్లలో కొమరగిరి చదునుకు తరలించారు. ఈ ముసుగులో సదరు ద్వారంపూడి రూ.35కోట్లకుపైగా బిల్లులు చేసుకున్నారు. వాస్తవానికి ఈలేఅవుట్ చదునుకు చేసిన వ్యయం రూ.80కోట్లపైనే. అధికారులు రహస్యంగా ఈబిల్లులు ఉంచారు. వాస్తవానికి చదును పేరుతో ద్వారంపూడి అంతకు మించే నొక్కేశారని సమాచారం. కొమరగిరి లేఅవుట్ పూర్తికి చాలా సమయం తీసుకోవడంతో సీఎం కార్యాలయం తీవ్రంగా పరిగణించింది. అప్పటి ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి రేవు ముత్యాలరాజు 2022లో కాకినాడ వచ్చి కలెక్టరేట్‌లో అత్యంత రహస్యంగా కలెక్టర్, ఇతర కీలకశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అంత ధర పెట్టి భూములు కొనుగోలు చేయడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. అటు లేఅవుట్ చదునుకు ఎకరాకు కనీసం రూ.15లక్షలలోపు చెల్లించాల్సి ఉన్నా రెట్టింపు వెచ్చించడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. భూముల కొనుగోలు, చదును వెనుక తతంగం అంతా పసిగట్టినా ఆ తర్వాత మౌనంగా ఉండిపోయారు. కాకినాడకు చెందిన వైసీపీ కీలకనేత బిల్లుల రూపంలో కోట్లలో డబ్బు సంపాదించిన విషయం గుర్తించినా మిన్నకుండిపోయారు.


రాష్ట్రంలో పలు ఇళ్లస్థలాల లేఅవుట్ల అవినీతిపై విచారణ చేయించడానికి కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తుండడంతో దీనిపైనా సమగ్ర దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉంది. ఇదిలాఉంటే 350ఎకరాల కొమరగిరి లేఅవుట్‌లో 13,551 మందికి పట్టాలిచ్చి దాదాపు మూడున్నరేళ్లలో పూర్తయిన ఇళ్లు వెయ్యిలోపే ఉండడం ఈలేఅవుట్‌పై పేదలు ఏ స్థాయిలో అనాసక్తిగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. మరోపక్క ఇప్పటికి భారీ వర్షాలు వస్తే లేఅవుట్ ముంపునకు గురవుతోంది. సముద్రం పక్కనే ఉండడంతో తుఫాన్ల సమయంలో బలమైన ఈదురుగాలులు లేఅవుట్‌పై వైపు వీస్తుండడంతో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

విచారణ జరిగితే భాగోతం బట్టబయలే..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో కొమరగిరి లేఅవుట్ అక్రమాలపై దర్యాప్తు చేయాలన్న డిమాండ్లు అంతకంతకు ఎక్కువగా వ్యక్తమవుతున్నాయి. రూ.200కోట్ల వరకు ఇక్కడే వెచ్చించడం వెనుక భాగోతం బయటపెట్టాలని అంతా కోరుతున్నారు. ఇందులో రూ.80కోట్లకుపైగా అప్పటి వైసీపీ నేతలు మెక్కేసిన విషయం తేల్చాలనే డిమాండ్లు వస్తున్నాయి. మరోపక్క ఈ లేఅవుట్ కోసం చేసిన ఖర్చు వెనుక భారీ కుంభకోణం ఉందనే అనుమానాలు బలపడుతున్నాయి. ఇప్పటికే ఇదే విషయమై కాకినాడ సిటీ టీడీపీ ఎమ్మెల్యే కొండబాబు ఇటీవల కలెక్టర్ షాన్ మోహన్‌ను కలిశారు. కొమరగిరి కుంభకోణంపై విచారణ చేపట్టాలని కోరారు. ఈ మేరకు ఆయన స్వయంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

'మధ్యాహ్న భోజనం'.. తినలేకపోతున్నాం..
పట్టించుకోండి

» ఇంటి నుంచి భోజనం తెచ్చుకుంటున్న విద్యార్థులు



రౌతులపూడి హైస్కూల్‌లో పెట్టిన మధ్యాహ్న భోజనంలో అధ్వానంగా ఉన్న గుడ్డు పులుసు కూర

రౌతులపూడి, ఆగస్టు 12: 'భోజనం తినలేకపోతున్నాం.. పట్టించుకోండి' అంటూ విద్యార్థులు కోరుతున్నారు. రౌతులపూడి మండలంలోని హైస్కూల్ తోపాటు అన్ని పాఠశాలలకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా సోమవారం కూరగాయల పలావు, కోడిగుడ్డు కూర వచ్చింది. గుడ్డు పులుసు అస్సలు బాగోకపోవడంతో చాలామంది విద్యార్థులు తినలేకపోయారు. పలావు కూడా బాగోలేదని చాలామంది వాపోయారు. రౌతులపూడికి చెందిన హైస్కూల్ విద్యార్థులు కొంతమంది ఓ హోటల్‌కి వెళ్లి టిఫిన్ చేసి సరిపెట్టుకున్నారు. ఎవరైనా భోజనం ఎలాగుందని అడిగితే బాగుందని చెప్పాలని ఉపాధ్యాయులు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నట్టు తెలుస్తోంది. రౌతులపూడి పాఠశాలలో 800మంది విద్యార్థులుండగా చాలామంది బయట గ్రామాలనుంచి వస్తున్న విద్యార్థులు మధ్యాహ్న భోజనం బాగోక ఇంటినుంచి క్యారేజ్‌లు తెచ్చుకుంటున్నారు. నూతన పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్లు, ఉన్నతాధికారులు స్పందించి మంచి భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

యథేచ్ఛగా వన్యప్రాణుల వేట

» అటవీప్రాంతాల్లో విద్యుత్ తీగలతో వేటసాగిస్తున్న వేటగాళ్లు



జగ్గంపేట పరిసరాల్లో విద్యుత్ తీగలు అమర్చేందుకు స్తంభానికి వేసిన నిచ్చెన

జగ్గంపేట, ఆగస్టు 12: జగ్గంపేట సరిహద్దు ప్రాంతాల్లో యథేచ్ఛగా వన్యప్రాణుల వేట సాగుతోంది. ప్రత్తిపాడు, రంపచోడవరం నియోజకవర్గాల్లోని లోతట్టు ప్రాంతాల్లోను జగ్గంపేట, గోకవరం, ఏలేశ్వరం, గంగవరం మండలాలకు చెందిన గ్రామాలున్నాయి. ఈప్రాంతాల్లో అటవీప్రాంతం అధికంగా ఉంది. దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు వేటగాళ్లు వన్యప్రాణుల వేట యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. రాత్రిపూట హైఓల్టేజీ విద్యుత్‌తీగలకు నిచ్చెనలు వేసుకుని విద్యుత్‌స్తంభాలవద్ద పైకి ఎక్కి కిందకు వేలాడేలా విద్యుత్ తీగలు అమర్చుతున్నారు. ఇలా అడవిపందులు, దుప్పిలు, కుముజులు, కొండ గొర్రెలు వంటి వన్యప్రాణులను వేటగాళ్లు వేటాడుతున్నారు. జగ్గంపేట మండలం భావారం, నరేంద్రపట్నం, గోవిందపురం, గోకవరం మండలం మల్లవరం, గంగవరం మండలం మొల్లేరు ప్రాంతాలతోపాటు ఏలేశ్వరం మండలం, జగ్గంపేట మండలాలకు చెందిన రిజర్వాయర్ ఫారెస్టులో నిత్యం ఈ తరహా వన్యప్రాణుల వేట ఘటనలు జరుగుతున్నాయి. కొందరు పెద్దల ఇళ్లవద్ద విందుల్లో మాంసాహార భోజనాలకు ఈ వన్యప్రాణుల వంటలు చేయడంకోసం ఒక దళారీ వ్యవస్థ నడుస్తోంది. దీనిలో భాగంగా ఈ ప్రాంతంలో ఉన్న వేటగాళ్లకు ముందుగా అడ్వాన్సులు సొమ్ములు చెల్లించి వేటపడిన వెంటనే వారికి కబురు పంపితే వారికున్న పలుకుబడితో ఈ మాంసాన్ని విజయవాడ, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు రవాణా చేస్తున్నట్టు సమాచారం. కొందరు పెట్టుబడి లేకుండానే వన్యప్రాణుల వేట కొనసాగిస్తూ లక్షల్లో సొమ్ములు చేసుకుంటున్నారు. ఈ తరహా వేటలన్నీ జగ్గంపేట, గోకవరం, ఏలేశ్వరం మండల పరిధిలో వేటగాళ్ల కనుసన్నల్లోనే నడుస్తున్నాయి. విద్యుత్‌వైర్లు సాయంత్రం అమర్చి ఉదయం ఆపేస్తున్నారు. దీనివల్ల కొన్నిగ్రామాల్లో రాత్రిపూట విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని గ్రామస్తులు చెప్తున్నారు.

కార్పొరేషన్ సొమ్ములు దోచుకున్న ద్వారంపూడిపై విచారణ చేపట్టాలి: ఎమ్మెల్యే కొండబాబు



కమిషనర్‌కు ఆధారాలతో కూడిన అంశాలను అందజేస్తున్న ఎమ్మెల్యే

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 12: కాకినాడ స్మార్ట్‌సిటీ అభివృద్ధికి నూతన ప్రగతి ప్రణాళిక రూపొందించి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కార్పొరేషన్ సొమ్ములను దోచుకున్న ద్వారంపూడిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ భావనను సోమవారం కలిసి 2019 నుంచి 2024 వరకు మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి మున్సిపల్ కార్పొరేషన్‌ను ఏవిధంగా లూటీ చేశారో అన్ని అంశాలను ఆధారాలతో సహా అందజేసి విచారణ చేపట్టాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే కొండబాబు మీడియాతో మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ద్వారంపూడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఒక్క రూపాయి నిధులు తీసుకురాకుండా ప్రజలు కట్టిన పన్నులు రూ.వందల కోట్లు దోచేశాడన్నారు. తన హయాంలో కాకినాడ అభివృద్ధి ఎలా ఉండాలని ప్రజ లు భావిస్తున్నారో ఆవిధంగా అభివృద్ధి అందించేలా నూతన కార్యాచరణ రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే కొండబాబు తెలిపారు. ఆయన వెంట టీడీపీ నగర అధ్యక్షు డు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, ఒమ్మి బాలాజీ, గుమ్మల్ల చిన్న ఉన్నారు.

పింఛన్ల పంపిణీలో అలసత్వంపై కలెక్టర్ ఆగ్రహం

» 20మంది సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 12: ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో తీవ్ర అలసత్వం వహించిన 20మంది సచివాలయ సిబ్బందికి తక్షణమే షోకాజ్ నోటీసులు ఇవ్వాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం పంచాయతీరాజ్, జడ్పీ, జిల్లా గ్రామీణాభివృద్ధి జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన వివరణ ఇవ్వని సచివాలయ సిబ్బందిని సస్పెండ్ చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో విధినిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించనని హెచ్చరించారు. ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యాన్ని విడిచి పెట్టి నూరు శాతం పంపిణీకి కృషి చేయాలన్నారు. ఈనెలలో తొలిరోజున 95శాతం మేరకు పంపిణీ చేశారని, పింఛన్ల పంపిణీలో అలసత్వం వల్లే నూరుశాతం చేరుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనివల్లే కఠిన చర్య లు తీసుకుంటున్నామన్నారు. జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామచంద్రమూర్తి, డీపీవో భారతి సౌజన్య, డీఆర్డీఏ పీడీ శ్రీరమణి, డ్వామా పీడీ వెంకటలక్ష్మీ, పంచాయతీరాజ్ ఎస్ఈ మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ 17కు వాయిదా

తొండంగి/కాకినాడ రూరల్, ఆగస్టు 12: జిల్లాలోని మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటు కౌన్సెలింగ్ ఈనెల 17వతేదీకి వాయిదా పడింది. జీవో నెంబరు 117ను అనుసరించి పాఠశాలల్లో మిగులుగా గుర్తించిన ఉపాధ్యాయుల జాబితా ను విద్యాశాఖ ఆదివారం రాత్రి విడుదల చేసింది. అభ్యం తరాల పరిశీలన తర్వాత సాయంత్రం 3 గంటలకు మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో మిగులు ఉపాధ్యాయలకు కౌన్సిలింగ్ జరిపి వారికి మండలంలో స్థానాలు కేటాయించాలని సూచించారు. దీనికి ఎంఈవోలు సిద్ధమవుతుండగా ఉపాధ్యాయ సంఘాలు దీన్ని బహిష్కరించాలని పిలుపునిచ్చాయి. అసంబద్ధ సర్దుబాటు రద్దు చేయాలంటూ భోజన విరామంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన జరిపారు. దీంతో ఈనెల 16న తుది జాబితా ప్రకటించి 17న కౌన్సెలింగ్ జరిపేందుకు నిర్ణయించారు. దీంతో కౌన్సెలింగ్ వాయిదా పడింది.

'మీకు తెలుసా' కరపత్రం ఆవిష్కరణ

కాకినాడ సిటీ, ఆగస్టు 12: హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణ పట్ల ప్రజల్లోఅవగాహన పెంపొందించేందుకు జాతీ య ఎయిడ్స్ నియంత్రణ సంస్థ(ఎన్ఏసీవో) నేతృత్వంలో రెండు నెలలపాటు నిర్వ హించే 'మీకు తెలుసా' కార్యక్రమం కరపత్రాన్ని కలెక్టర్ షాన్‌మోహన్ ఆవిష్కరిం చారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో వివిధశాఖల అధికారుల సమక్షంలో ఈ కరపత్రాన్ని కలెక్టర్ సోమవారం విడుదల చేశారు.

తోలుబొమ్మలాట కళాకారుడికి సత్కారం

ప్రాచీనకళ తోలు బొమ్మ లాటను ప్రజలకు అందుబాటులో ఉంచాలనే ఉద్దేశ్యం తో ప్రభుత్వం ఈ కళ ను ప్రోత్సహిస్తోందని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. ఇటీవల పాండిచ్చేరిలో జరిగిన కార్యక్రమంలో ఐక్యరాజ్య సమితి అంతర్జాతీ య శాంతి మండలినుంచి కళారత్న అవార్డు పొందిన తోలుబొమ్మలాట కళాకారుడు తోట బాలకృష్ణ దంపతులను సోమవారం కలెక్టర్ శాలువాతో సత్కరించారు.

కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదులకు
381 అర్జీలు



వృద్ధురాలి గోడు వింటున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 12: ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి సోమవారం 381 అర్జీలు వచ్చాయి. కలెక్టర్ షాన్‌మోహన్ ఆధ్వర్యంలో అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలన్నారు. అర్జీల వివరాలను విధిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అర్జీల ప్రగతిని ప్రతి శనివారం సమీక్షిస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో తిప్పేనాయక్, జడ్పీ సీఈవో శ్రీరామచంద్రమూర్తి, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, సీపీవో త్రినాథ్, డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి అర్జీలను స్వీకరించారు.

ఎస్పీ కార్యాలయానికి 48 అర్జీలు

కాకినాడ క్రైం, ఆగస్టు 12: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వివిధ సమస్యల పరిష్కారంకోసం 48మంది నుంచి అర్జీలు, ఫిర్యాదులు స్వీకరించినట్లు ఎస్ఈబీ ఏఎస్పీ కె.శ్రీలక్ష్మి తెలిపారు. ఫిర్యాదులు స్వీకరించిన తర్వాత సమస్యల పరిష్కారంకోసం సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి సత్వర పరిష్కారం చూపాలని ఆదేశాలు జారీ చేశారు.

సీతాకోక చిలుకమ్మా... సింగారం నీదేనమ్మా!



పచ్చని చిలుకలు తోడుంటే
పాడే కోయిల వెంటుంటే
భూలోకమే ఆనందానికి ఇల్లు....
అని ఓ సినీకవి వర్ణించినట్టు
కనిపిస్తున్నాయి కదూ ఇవి...
కానీ ఇవి చిలుకలు కాదు
సీతాకోకచిలుకలు. అల్లూరి
సీతారామరాజు జిల్లా
మోతుగూడెం పరిధిలోని పొల్లూరు
విద్యుత్ కేంద్రం వద్ద సోమవారం
ఇలా కనువిందు చేశాయి.

- మోతుగూడెం



రేపటి నుంచి వాడపల్లి వెంకన్న పవిత్రోత్సవాలు

ఆత్రేయపురం, ఆగస్టు 12: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలను గురువారం నుంచి మూడు రోజుల పాటు తిరుమల తరహాలో వైభవంగా నిర్వహించనున్నారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు సకలదోష పరిహారార్థం ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. సంకల్పం, విశ్వక్సేన పూజ, దీక్షా ధారణ, అకల్మష హోమం, సాయంత్రం అంకురార్పణ, వాస్తు పూజలతో బుధవారం ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 15వ తేదీన ప్రధాన హోమాలు, అష్టకలశారాధన, పవిత్ర ప్రతిష్ఠ హోమాలు, పవిత్ర ఆరోహణ, 16న మహాశాంతి హోమం, ప్రాయశ్చిత్త హోమం, పూర్ణాహుతి, పవిత్ర విసర్జన, మహాదాశీర్వచనంతో ఉత్సవాలు ముగుస్తాయి. వీటికి సంబంధించి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. ఈ నేపథ్యంలో 14 నుంచి 16వ తేదీ వరకు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు, ఉపనయనాలను రద్దు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.



నేడు మంత్రి నాదెండ్ల మనోహర్
కాకినాడ రాక
కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 12: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం కాకినాడ రానున్నారు. ఉదయం పది గంటలకు కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్, పోర్టు, పోలీసు, కస్టమ్స్, పౌర సరఫరాలు, కార్పొరేషన్ అధికారులతో బియ్యం ఎగుమతులు, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా నియంత్రణపై సమీక్షిస్తారు.



తనకు జరిగిన మోసాన్ని డీఆర్వోకు వివరిస్తున్న బాధితుడు కృష్ణమోహన్

పెళ్లి పేరిట రూ.6 లక్షలకు టోకరా
మహిళ, మరో 11 మందిపై డీఆర్వోకు ఫిర్యాదు

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 12: పెళ్లి పేరుతో ప్రియ అనే మహిళ తనకు రూ.6 లక్షలకు టోకరా వేసిందని కాకినాడకు చెందిన కృష్ణమోహన్ కాకినాడ కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో డీఆర్వో తిప్పేనాయక్‌కు సోమవారం ఫిర్యాదు చేశాడు. ఈ వ్యవహారంలో భాగస్వాములైన 11 మందిపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. నిశ్చితార్థం రోజున తనవద్ద రూ.6లక్షలు తీసుకుని మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు. ఇలాంటి మోసాలు జరగకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో
బైక్ రైడర్ దుర్మరణం

తొండంగి, ఆగస్టు 12: కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి వై.జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై సోమవారం జరిగిన ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన యూట్యూబర్, బైక్ రైడర్ పుగాకు సోంబాబు (35) దుర్మరణం పాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... హైదరాబాద్‌కు చెందిన సోంబాబు మరో ఇద్దరితో కలిసి తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఈ నెల 10న జరిగిన మిత్రుని వివాహానికి హాజరయ్యారు. అక్కడి నుంచి వారంతా విశాఖపట్నం వెళ్లి తిరిగి వస్తుండగా బెండపూడి వై.జంక్షన్ వద్ద హైవే ఎక్కుతున్న బస్సు ఢీకొనడంతో సోంబాబు తీవ్రంగా గాయపడ్డాడు. 108 అంబులెన్సులో తుని ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. తొండంగి ఎస్ఐ వినయ్‌ప్రతాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతుడు సోంబాబు (పాత చిత్రం)



ఆ ఘనులెవరో!

వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వందల కోట్లు దోపిడీకి గురయ్యాయి. కనీస లీజు విధానం పాటించకుండా, ఒక పద్ధతిగా వ్యవహరించకుండా దశాబ్దాలుగా గనుల వెలికితీత పనిలో నిమగ్నమైన లీజుదారులను తరిమేసి గనులను దోచేసుకోవడం గమనార్హం. వైసీపీ అరాచకాలు, ఆగడాలను తట్టుకోలేదని అనేక మంది లీజుదారులు వ్యాపారాలు వదిలేసుకున్నారు. తమ లారీలు, ఎక్సకవేటర్లు మొదలైన వాటిని అయినకాడికి అమ్మేసుకున్నారు. చాలా మంది క్రషర్లు ఆగిపోయాయి. వైసీపీ పీడ వదిలి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు.

- గనులను దోచేసిన వైసీపీ నేతలు
- గత లీజుదారులను తరిమేసి.. నిలువుదోపిడీ
- గనుల శాఖ ఉన్నతాధికారుల సహకారం
- ప్రభుత్వ పెద్దల ఇష్టారాజ్యం
- చక్రం తిప్పిన మాజీ మంత్రి అనుచరులు
- కూటమి ప్రభుత్వం రావడంతో బయటకొస్తున్న బాధితులు
- భయపడుతున్న అక్రమార్కులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

తూర్పు గోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గంలో అనేక కొండలు అదృశ్యమైన సంగతి తెలిసిందే. సీతానగరం మండలం నాగంపల్లి కొండల శ్రేణుల్లో బిల్డింగ్ మెటల్ దొరుకుతుంది. దానికి గతంలో ఓ వ్యాపారి దరఖాస్తు చేసుకున్నాడు. గత ప్రభుత్వంలో అతడిని ఇబ్బంది పెట్టి రాయలసీమ ప్రాంతానికి చెందిన ఓ మంత్రి బంధువైన నెల్లూరుకు చెందిన ఒక వ్యక్తి మధ్యలో దూరాడు. స్థానిక నేతలపై ఒత్తిడి తెచ్చి వందలాది ఎకరాల కొండలను వేలం వేయడానికి సిద్ధం చేసినట్టే చేసి తర్వాత వాటన్నింటినీ హోల్డ్‌లో పెట్టి ఇష్టానుసారం దోచుకోవడం గమనార్హం. పోలవరం కాలువ ఒడ్డున ఉన్న క్రషర్లలో చాలా వాటికి అనుమతి లేకపోవడం గమనార్హం. మన జిల్లాకు చెందిన మాజీ మంత్రి ఒకరు ఇక్కడ క్రషర్‌ను కైవసం చేసుకున్నట్టు చెప్తున్నారు. వైసీపీ మరోసారి అధికారంలోకి వస్తే దేవీపట్నం మండలం, సీతానగరం, కోరుకొండ, గోకవరం సరిహద్దుల్లో ఉన్న కొండలన్నిటినీ మాయం చేయడానికి పెద్ద స్కెచ్ వేసినట్టు ఇప్పుడిప్పుడే బయటపడుతోంది.

ఉమ్మడి జిల్లాలో లేటరైట్ దోపిడీ రూ.కోట్ల మీదే ఉండడం గమనార్హం. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని ప్రత్తిపాడు మండలం చింతలూరు, వంతాడ గ్రామాల్లో లేటరైట్ గనులు ఉన్నాయి. గతంలో వీటిని ప్రస్తుత తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి గ్రామానికి చెందిన అంధ్రూస్ సంస్థ, ఓ ప్రముఖ సినీ నటి మేనల్లుడికి చెందిన మహేశ్వరి మినరల్స్, అనపర్తి మండలానికి చెందిన సత్తి లక్ష్మణరెడ్డి, గంగాధరరెడ్డిలకు చెందిన కంపెనీలు లీజుకు తీసుకుని లేటరైట్ వ్యాపారం చేసేవి. వైసీపీ అధికారంలోకి రాగానే ఆ పార్టీ పెద్దల కన్ను లేటరైట్ మీద పడింది. రాజమహేంద్రవరం విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో క్షుణ్ణంగా అక్కడ తవ్వకాలు, గనుల పరిస్థితిపై విచారణ చేయించి రిపోర్టును రాజమహేంద్రవరం విజిలెన్స్ ఆఫీసుకు తెలియనీయకుండా రాష్ట్ర కార్యాలయానికి రప్పించుకున్నారు. అప్పట్లో ఇక్కడ బ్యాక్సైట్ ఉందనే ప్రచారం జరిగింది. విజిలెన్స్, మైన్స్ అధికారులు కూడా అప్పట్లో మౌనం వహించిన సంగతి తెలిసిందే. ఇక్కడ పరిస్థితిపై రిపోర్టు తీసుకెళ్లిన తర్వాత కొద్దిరోజులు పనులు ఆగాయి. ఇంతలో నర్సీపట్నం ఏరియాలో లేటరైట్ అక్రమాలు తవ్వకాలు జరుగుతున్నాయని టీడీపీ, ఇతర ప్రతిపక్షాలు ఆందోళన చేయడంతో అక్కడ తవ్వకాలు ఆగాయి. సిమెంట్ ఫ్యాక్టరీలకు లేటరైట్ అవసరం. ఈ పరిస్థితుల్లో వైసీపీ పెద్దలు చింతలూరు, వంతాడ నుంచి లైటరైట్ తరలించుకుపోవడానికి కుట్ర చేశారు. అప్పటికే సుమారు 4 లక్షల టన్నుల వరకూ లేటరైట్ స్టాక్ ఉంది. దీనిని తరలించుకుపోవడానికి ఒత్తిడి చేశారు. కానీ అక్కడి లీజుదారులు ఒప్పుకోలేదు. దీంతో 2010 నుంచి పెండింగులో ఉన్న ఓ సంక్షేమ సేవా సమితి అప్లికేషన్‌ను తెరమీదకు తెచ్చారు. దానిపేర బినామీ లీజు పొందారు. కానీ అక్కడ లేటరైట్ లేదని 2017లోనే ఇది ఎలిజిబుల్ కాదని, అప్పటి డీఎంజీ (ఎఫ్ఏసీ) బి.శ్రీధర్ ఫైల్‌ను రాజమహేంద్రవరం మైన్స్ అసిస్టెంట్ డైరెక్టర్‌కు పంపించారు.

ఇదిలా ఉండగా 2022 మార్చి 11న చింతలూరులోని సర్వే నెం.1లో సుమారు 36 హెక్టార్లలో లీజు ఖరారు చేస్తూ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ అండ్ జియాలజీ ఉన్నతాధికారి ఉత్తర్వు జారీ చేశారు. ఇక్కడ లేటరైట్‌ను బెనిఫికేషన్, సెపరేషన్, స్టోరింగ్, సెల్లింగ్ చేయడానికి లైసెన్స్‌ను ఓ మాజీ మంత్రి బంధువు పేరిట ఇచ్చారు. కానీ వారు లీజు దక్కించుకున్న సంక్షేమ సేవా సమితి లీజు స్థలంలో అసలు మైనింగ్ చేయకుండా గతంలో లీజుకు తీసుకున్న వారి భూముల్లో లేటరైట్ తవ్వేయడంతో పాటు... వారి స్టాక్ పాయింట్లలోని లేటరైట్ తరలించుకుపోవడం గమనార్హం. ఇక్కడ అటవీ ప్రాంతంలోని కొండలు తవ్వేసినట్టు కొందరు చెప్తున్నారు. ఇంత జరుగుతున్నా వైసీపీ పెద్దల అరాచకాలకు భయపడి లీజుదారులు మౌనంగా ఉండిపోయారు.

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొందరు లీజుదారులు ముందుకు వచ్చి ఇక్కడి అక్రమాలపై ఫిర్యాదు చేస్తున్నారు. అనపర్తి మండలం రామవరం గ్రామానికి చెందిన సత్తి లక్ష్మణరెడ్డి జూన్ 10వ తేదీన విజయవాడ ఇబ్రహీంపట్నంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మైన్స్ జియాలజీకి ఫిర్యాదు చేయడం గమనార్హం. ఇక్కడ సుమారు 10 లక్షల టన్నుల లేటరైట్ అక్రమ తవ్వకాలు జరిగినట్టు అందులో ఫిర్యాదు చేశాడు. మిగతావారు కూడా ఒక్కొక్కరుగా నెమ్మదిగా బయటకి వస్తున్నారు.

మైనింగ్ అక్రమాలపై కూటమి ప్రభుత్వం సీరియస్!

జిల్లా నుంచి లేటరైట్, గ్రావెల్, చింతూరు ప్రాంతం నుంచి క్వార్ట్జ్ కూడా అక్రమంగా తరలించుకు పోయినట్టు ఆరోపణలు ఉన్నాయి. గజ్జనపూడి ఫారెస్ట్‌లో అక్రమ మైనింగ్ చేసి పలు కేసుల్లో ఇరుక్కుని విజిలెన్స్ విధించిన జరిమానాలు కూడా కట్టకుండా తప్పించుకున్న వ్యక్తితో కూడా కుమ్మక్కయి అక్కడ రివిజన్ చేయించే ప్రయత్నాలు చేయడం గమనార్హం. ప్రభుత్వం మారడంతో అది ఆగిపోయింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ మైనింగ్ అక్రమాలపై సీరియస్‌గా ఉన్న సంగతి తెలిసిందే. ఈ అక్రమాలకు ప్రధాన కారకుడైన ఉన్నతాధికారిని సస్పెండ్ చేయడంతో పాటు ఆయనపై ఏసీబీ విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. మరోపక్క ఇసుక, గనుల అక్రమాలపై సీబీసీఐడీతో విచారణ చేయించనున్నారు. ఇప్పటికే ఇతర జిల్లాల్లో విచారణకు రాజమహేంద్రవరం విజిలెన్స్ అధికారులు కొందరు నియమితులు కావడం గమనార్హం. త్వరలో జిల్లాలో కూడా విచారణ చేపట్టనున్నారు. రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఇటీవల రాజమహేంద్రవరం వచ్చినపుడు కొందరు బాధితులు తమ గోడు విన్నవించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే బాధితులెవరైనా సరే ధైర్యంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. గనులను దోచేసిన ఆ ఘనుల సంగతి త్వరలో తేలుతుందని జిల్లాకు చెందిన రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చెప్పడం గమనార్హం.




రాఘవ కనస్ట్రక్షన్స్ పేరిట ప్రతిమా ఇన్‌ఫ్రా దోపిడీ!

వైసీపీ ఆధ్వర్యంలో ఏ నిబంధనలూ పాటించకుండా రూ.కోట్లలో ఇసుక దోపిడీ చేశారు. మొదట జేపీ సంస్థకు కాంట్రాక్టు ఇచ్చి కనీసం ర్యాంపుల సరిహద్దులు కూడా గుర్తించని సంగతి తెలిసిందే. పైగా ఆన్‌లైన్ నిలిపివేసి కేవలం నగదు రూపేణా మాత్రమే వసూలు చేశారు. గత ఏడాది మేనెలలో ఆ సంస్థ కాంట్రాక్టు గడువు ముగిసినప్పటికీ దాని పేరిటే డ్రెడ్జింగ్ కూడా చేశారు. ఆ సంస్థను పక్కన పెట్టి వైసీపీ పెద్దలే కొవ్వూరు వైపు ఒకరికి, రాజమహేంద్రవరం వైపు ఒకరికి ఇచ్చేసి... నెలకు రూ.30కోట్ల వరకు కప్పం కట్టించుకున్నారు. తర్వాత కోర్టు జోక్యంతో ప్రతిమా ఇన్‌ఫ్రా సంస్థను తెరమీదకు తెచ్చి, దాని పేరిట ఆర్‌కే అనే వ్యక్తి మొత్తం దోపిడీ చేశారు. అంతేకాక అంతకు ముందే డ్రెడ్జింగ్‌కు ఒప్పందం కుదుర్చుకున్న రాఘవ కనస్ట్రక్షన్‌ను అప్పటి వరకు పనిచేయనివ్వకుండా చేసి గత ఏడాది డిసెంబరులో వాళ్లనూ తెరపైకి తెచ్చి మరింత దోచేశారు. చివరకు రాఘవ కనస్ట్రక్షన్ కంపెనీకి ఇవ్వాల్సిన డబ్బు కూడా ఎగ్గొట్టి ప్రతిమా ఇన్‌ఫ్రా సంస్థ పనులు వదిలేసి వెళ్లిపోవడంతో ఇవాళ అధికారులు లబోదిబోమంటున్నారు. కూటమి ప్రభుత్వం ఈ వ్యవహారాలపై విచారణ చేపట్టనుంది.



చెట్టు మోదులను పైకిలేపిన దృశ్యం

సినిమా చెట్టు... నిలబడేటట్టు!



కొవ్వూరు, ఆగస్టు 12: తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవంలో నేలకొరిగిన సినిమా చెట్టును పునరుజ్జీవింపచేసే పనులకు రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్ సభ్యులు సోమవారం శ్రీకారం చుట్టారు. నేలవాలిన చెట్టు కొమ్మలకు లేపనాలు పూశారు. చెట్టు కొమ్మలను పూర్తిగా కత్తిరించి రెండుగా విడిపోయిన మాను భాగాలను పైకిలేపి ఒక్కటిగా కలిపే యత్నం చేశారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్జేసీ సుబ్బారావు, అధికారులు

భీమేశ్వరస్వామి దేవస్థానంలో రికార్డుల తనిఖీ

ద్రాక్షారామ, ఆగస్టు 12: ద్రాక్షారామ భీమేశ్వరస్వామి దేవస్థానంలో అవినీతి, అవకతవకలు ఆరోపణల నేపథ్యంలో దేవదాయ శాఖ అధికారులు సోమవారం వసతి గృహంలో రికార్డుల తనిఖీ చేపట్టారు. ఈవో పీటీవీ సత్యనారాయణపై మంత్రి వాసంశెట్టి సుభాష్ దేవదాయ శాఖ కమిషనరుకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కమిషనరు ఆదేశాలతో ఇప్పటికే దేవదాయ శాఖ ఆర్జేసీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు కె.సుబ్బారావు ఈ నెల 9న ద్రాక్షారామలో ఫిర్యాదులు స్వీకరించారు. అంతేగాక గత ఐదేళ్ల పాటు దేవస్థానం రికార్డులను తనిఖీ చేయడానికి అధికారుల బృందాన్ని నియమించారు. ఆర్జేసీ సుబ్బారావు పర్యవేక్షణలో సహాయ కమిషనరు ఎస్ఎస్ చక్రధరరావు, కమిషనరు కార్యాలయ పర్యవేక్షకురాలు జ్యోతి, ఈవోలు సన్యాసిరావు, కె.శ్రీనివాసరావు, వెంకట్రావు, ఏఈ ఈశ్వర్, కమిషనరు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వెంకట్రావు, ఆర్జేసీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఆచంట శ్రీనివాస్ రికార్డుల పరిశీలన ప్రారంభించారు. ఈవోపై వచ్చిన పలు ఫిర్యాదులతో పాటు రికార్డుల పరిశీలన ఆధారంగా కమిషనరుకు నివేదిక సమర్పిస్తారు. అంతేగాక గత ఐదేళ్లలో జరిగిన పూర్తి లావాదేవీలపై కూడా అధికారుల బృందం నివేదిక ఇవ్వనున్నట్టు తెలుస్తోంది.

కట్టు కాల్వలో కాళ్లు కడుక్కునేందుకు దిగిన
యువకుడు మృతి
ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం బీచ్ వద్ద ఘటన

ఉప్పలగుప్తం, ఆగస్టు 12: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం బీచ్ వద్ద ప్రమాదవశాత్తు కట్టు కాల్వలో పడి అమలాపురం మండలం వన్నెచింతలపూడికి చెందిన చికిలే సందీప్ (17) మృతి చెందాడు. సందీప్ సోమవారం మిత్రులతో కలిసి ఎస్.యానాం బీచ్‌కు వచ్చాడు. సముద్రంలో స్నానాల అనంతరం సమీపంలో ఉన్న కట్టుకాల్వలో కాళ్లు శుభ్రం చేసుకునేందుకు దిగి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. స్థానిక మత్స్యకారులు అతడిని రక్షించి ఒడ్డుకు తీసుకొచ్చారు. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్టు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఇంటర్ చదివిన సందీప్ విశాఖలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో చేరాడు. అతడి సోదరుడు గౌతమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ మనోహర్‌జోషీ తెలిపారు.



మృతుడు సందీప్ (పాత చిత్రం)

గంజాయి కేసులో నలుగురి అరెస్టు

చింతూరు, ఆగస్టు 12: గంజాయి కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు సీఐ గజేంద్రకుమార్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడకు చెందిన బప్పిరాయ్, కిరండోల్‌కు చెందిన షివేందురాయ్, సుక్మాకు చెందిన ధర్మేంద్ర సింగ్ మనిష్‌సింగ్ గంజాయితో పట్టుబడ్డారు. వీరంతా ఛత్తీస్‌గఢ్‌లోని కుంట నుంచి చింతూరు మండలం చట్టి మీదుగా భద్రాచలం వైపు ఆదివారం రాత్రి పదకొండు గంటల సమయంలో కారులో వెళ్తున్నారు. తనిఖీల్లో భాగంగా కారును ఆపి డిక్కీ తెరిచి చూడగా అందులో 15 కిలోల గంజాయి కనిపించింది. కారుతో పాటు అందులో వున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. ఇదే కేసులో వీరితో పాటు కుంటకు చెందిన ఇషాద్, పవన్‌లపై కూడా తమకు అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామని, వారిద్దరూ పరారీలో వున్నారని సీఐ చెప్పారు.

గేమ్ చేంజర్: ఎల్లో ఉగ్రవాది
ఈ పేరుతో సోషల్ మీడియాలో రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం
భారత న్యాయ సంహిత చట్టం కింద ఎటపాక పోలీస్ స్టేషన్లో కేసు నమోదు

రంపచోడవరం, ఆగస్టు 12: చంద్రబాబు సారథ్యంలో ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం సాగించి ప్రభుత్వ విచ్ఛిన్నానికి పాల్పడుతున్న వారిపై మన్యంలో కేసు నమోదైంది. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక పోలీసు స్టేషన్లో క్రైం నెం.104/2024 కింద నమోదైన కేసు వివరాలు ఇలా వున్నాయి.... రాష్ట్రంలో యూట్యూబ్ అకాడమీ స్థాపించడానికి యూట్యూబ్ గ్లోబల్ సీఈవోతో జరిగిన చర్చలపై గూగుల్ హెడ్‌ని ట్యాగ్ చేసి 'ఎక్స్'లో ముఖ్యమంత్రి పోస్టు పెట్టారు. దానికి గేమ్ చేంజర్: ఎల్లో ఉగ్రవాది అనే అతను రిప్లై ఇస్తూ రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ సక్రమంగా లేదని గూగుల్‌ని ట్యాగ్ చేస్తూ... మీ కంపెనీలో మహిళా ఉద్యోగులు వేధింపులకు గురైనా పోలీసులు చూస్తూ ఉంటారనడంతో పాటు పలు అంశాలను ప్రస్తావిస్తూ రిప్లై ఇచ్చాడు. ఇలా సోషల్ మీడియాలో నేరపూరిత కుట్రకు పాల్పడటం, వర్గ విభేదాలను సృష్టించడం, తప్పుడు ప్రకటనలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఎటపాకకు చెందిన పాటి సంపత్, మరో ఇద్దరు ఎటపాక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో భారత న్యాయ సంహిత చట్టంలో 61(2), 196(1), 353(2) సెక్షన్ల కింద ఎటపాక పోలీసులు కేసు నమోదు చేశారు. ఐటీ నిపుణుల సహాయంతో సోషల్ మీడియా సంస్థల నుంచి సమాచారాన్ని సేకరిస్తూ నిందితులను గుర్తించే దిశలో కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సామర్లకోట, ఆగస్టు 12: సామర్లకోట-పిఠాపురం రైల్వే లైన్ మధ్య నడుస్తున్న 48 ఏళ్ల వ్యక్తిని అతి వేగంగా వెళ్తున్న భువనేశ్వర్-రామేశ్వరం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఢీకొంది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందినట్టు సామర్లకోట రైల్వే పోలీసు స్టేషన్ ఇన్‌చార్జి ఎస్ఐ ఎన్.రవికుమార్ సోమవారం రాత్రి చెప్పారు. ఈ మేరకు రైలు లోకో పైలట్ సామర్లకోట రైల్వే అధికారులకు ఇచ్చిన సమాచారంతో రైల్వే పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టినట్టు చెప్పారు. నలుపు, తెలుపు, డార్క్ చెక్స్ షర్ట్ ధరించి, ఆరెంజ్, ఎల్లో రంగుతో కూడిన షార్ట్ నిక్కరు మాత్రమే ధరించి ఉన్నాడు. అంతకు మించి ఎటువంటి చిరునామా లభించలేదని ఎస్ఐ చెప్పారు.

కాకినాడ

16 నుంచి రెవెన్యూ సదస్సులు

పెద్దాపురం, ఆగస్టు 12: భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ఈ నెల 16 నుంచి 30 వరకూ మండల పరిధిలోని గ్రామాల్లో నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని తహశీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మీ కోరారు. గ్రామాల వారీగా భూసమస్యలపై, ప్రజలకు న్యాయం చేయడమే లక్ష్యంగా నిర్వహిస్తామన్నారు. 5 కేటగిరీల్లో ఫిర్యాదులు స్వీకరిస్తామని, సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

త్వరలో మత్స్యకారులకు వేట నిషేధ సాయం

మాజీ ఎమ్మెల్యే వర్మ

కొత్తపల్లి, ఆగస్టు 12: కూటమి ప్రభుత్వం త్వరలో తీరప్రాంత మత్స్యకారులకు వేట నిషేధ సాయం మంజూరు చేస్తుందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. సోమవారం మూలపేట తీరప్రాంతంలో మత్స్యకారులతో ఆయన సమావేశమయ్యారు. వేట నిషేధ సమయంలో పరిహారం చెల్లించి మత్స్యకారులను ఆదుకోవాలన్న ఆలోచన చేసినది టీడీపీ అన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మత్స్యకారులకు వేట నిషేధ సాయం రూ.20వేలుగా ప్రకటించారని, త్వరలో మత్స్యకారులకు పరిహార సాయం అందచేస్తారని వర్మ హామీఇచ్చారు. పేదలు ఇళ్ల నిర్మించుకోవడానికి అప్పులు చేయ కూడదని కూటమి ప్రభుత్వం రూ.3నుంచి 4లక్షల హౌసింగ్ లోన్లు మంజూరు చేస్తుందన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు అనిశెట్టి సత్యానందరెడ్డి, మత్స్యకారుల నాయకులు కంబాల రాంబాబు, మేరుగు సూరిబాబు, నాగు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లకు తక్షణం బిల్లులు చెల్లించాలి

అప్పా వ్యవస్థాపక అధ్యక్షుడు పిల్లా చంద్రం

పిఠాపురం, ఆగస్టు 12: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ గురుకుల పాఠశాలలకు సరుకులు సరఫరా చేసే వెండర్లు, కాంట్రాక్టర్లుకు తక్షణం బిల్లుల బకాయిలు చెల్లించాలని ఆల్ ఇండియా పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్(అప్పా) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పిల్లా చంద్రం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ ఉన్నతాధికారులను కోరినట్లు తెలిపారు. రాష్ట్రంలో వివిధ శాఖల పర్యవేక్షణలో ఉన్న గురుకుల పాఠశాలలకు కాయగూరలు, గుడ్లు, గ్యాస్, పప్పులు, ఇతర నిత్యావసర సరుకులు ఇచ్చే వారికి 5నెలల బకాయిలు ఉండటంతో వారు సరుకులను సరఫరా చేయలేమని చేతులెత్తేస్తున్నారని చెప్పారు. ఆదేవిధంగా గురుకులాల్లో ఉపాధ్యాయులకు 3నెలలుగా జీతాలు రావడం లేదని తెలిపారు. వసతిగృహాలు, కేజీబీవీ స్కూల్స్, గురుకులాల్లో పనిచేసే సెక్యూరిటీ గార్డులు, శానిటేషన్ వర్కర్లకు జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వీటిని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయుల జీతాలు, కాంట్రాక్టర్ల బిల్లుల బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు.

'ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి'

పిఠాపురం, ఆగస్టు 12: శక్తి సామర్థ్యాలు వినియోగించుకుని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డి.హరిశేషు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల స్కిల్‌హబ్‌లో జనరేట్ యువర్ బిజినెస్‌పై 3 రోజులు పాటు నిర్వహించే శిక్షణా తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ జరుగుతుందని హరిశేషు తెలిపారు. వ్యాపార నిర్వహణ శక్తి సామర్థ్యాలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా ఎదగడానికి కావలిసిన మెళకవులు, వ్యాపారం చేసుకునేందుకు విధి విధానాలు, మార్కెటింగ్, స్టాక్ నియంత్రణ పలు అంశాలపై శిక్షణ ఉంటుందని, శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారి శ్యామ్, కోఆర్డినేటర్ రేవతి, ఐఎల్‌వో ట్రైనర్స్ తరుణ్‌కుమార్, సత్యనారాయణ, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సంధ్యరావు పాల్గొన్నారు.

'యువత జీవితాన్ని నాశనం చేసుకోవద్దు'

సర్పవరం జంక్షన్, ఆగస్టు 12: యువత గంజాయి, డ్రగ్స్, మాదక ద్రవ్యాలబారిన పడి చేజేతులా ఆరోగ్యాన్ని పాడుచేసుకుని జీవితాన్ని నాశనం చేసుకోవద్దని డీఎల్డీవో పాఠంశెట్టి నారాయణమూర్తి కోరారు. సోమవారం ఏపీఎస్పీ హైస్కూల్లో గల ప్లస్ నందు నషాముక్త్ భారత్ అభియాన్ పేరిట వికసిత్ భారత్ కా మంత్ర్ భారత్ హో నపేసే స్వతంత్ర నినాదంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ మాఫియాలు విద్యార్థులు, యువతే టార్గెట్‌గా అక్రమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారన్నారు. విద్యార్థులతో నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కాకినాడ డివిజన్ ఉప విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు, ఏఎంఓ రామారెడ్డి, ఎంఈవో-2 ఏసుదాసు, హెచ్ఎం కోటంరాజు గాయత్రి, ఉపాధ్యాయులు పులవర్తి సూర్యప్రకాశ్, పాల్‌రాజ్, జీ నాగేశ్వరరావు,సూరిబాబు పాల్గొన్నారు.

'అంబేడ్కర్‌పై వైసీపీది కపట ప్రేమ'

కాకినాడ సిటీ, ఆగస్టు 12: బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై వైసీపీది కపట ప్రేమని, ఐదేళ్ల అధికారంలో ఎస్సీలకు ఎటువంటి ప్రయోజనం చేకూర్చని వైసీపీ ఇప్పుడు ఉనికి కోసం కూటమి ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తోందని జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొల్లాబత్తుల అప్పారావు ధ్వజమెత్తారు. జిల్లా టీడీపీ కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరావతిలో అంబేడ్కర్ విగ్రహం శిలాఫలకంపైగల మాజీ సీఎం జగన్ పేరును గుర్తు తెలియని వ్యక్తులు తొలగిస్తే దానికి కూటమి ప్రభుత్వానికి ఆపాదించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమావేశంలో ఎస్సీ సెల్ నాయకులు పలివెల రవి అనంతకుమార్, బంగారు సత్తిబాబు, దూళ్ల సత్యనారాయణ, సాదే సత్తిబాబు, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

'సర్వజన్ సమాజ్ పార్టీ సామాజిక చైతన్యవేదిక'

జగ్గంపేట, ఆగస్టు 12: సర్వజన్ సమాజ్ రాజకీయ పార్టీ కాదు సామాజిక, రాజకీయ చైతన్యవేదిక అని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ అన్నారు. సోమవారం జగ్గంపేటలోని షాదీఖానా కల్యాణ మండపం వద్ద విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుల రహిత సమసమాజం కావాలన్నదే డాక్టర్ అంబేడ్కర్ ఉద్దేశ్యం అన్నారు. నేడు సమాజంలో ప్రతిపక్షం, అధికార పక్షం కలిసిపోయి ప్రజలను మోసం చేస్తూ అవినీతిమయంలో కూరుకుపోతున్నాయన్నారు. ప్రశ్నించే తత్వం సమాజంలో లోపించిందన్నారు. సమావేశంలో సెక్రటరీ కె.కొండబాబు, జగ్గంపేట ఇన్‌చార్జ్ జి.రాజు, జిల్లా జాయింట్ సెక్రటరీ వి.నానిబాబు తదితరులు ఉన్నారు.

జానపద కళాకారుల నూతన కమిటీ ఎన్నిక

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 12: పాత బస్టాండ్ దగ్గర ఉన్న సుందరయ్య భవనంలో జానపద కళాకారుల సమావేశం సోమవారం నిర్వహించారు. జానపద కళాశాల సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా వీర్నాల కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా తోట పవన్‌కుమార్, జిల్లా కోశాధికారిగా వేర్నాల ప్రకాశ్‌రాజు, గౌరవాధ్యక్షుడిగా పుల్లారావు, ముఖ్య సలహాదారులుగా వెంకటేశ్వరరావు, ఏడుకొండలు, తోట బాలకృష్ణ ఎన్నికయ్యారు. ఈనెల 22న ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా కాకినాడ జిల్లాలో ఉన్న 30కి పైగా కళారూపాలతో కాకినాడ నగరంలో కలెక్టరేట్ నుంచి బాలాజీ చెరువుసెంటర్ వరకు ర్యాలీ నిర్వహించాలని తీర్మానించారు.

వేతనాలను విడుదల చేయాలని ధర్నా

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 12: జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న తమకు రావాల్సిన వేతనాలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వ పాఠశాలల, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. సీఐటీయూ నేత శేషుబాబ్జి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల్లో శానిటేషన్ ఆయాలకు కనీస వేతనాలు అమలుచేయాలని, ప్రతినెలా 5లోపు వేతనాలు చెల్లించాలన్నారు. కనకాల దుర్గ, ఎం.సుబ్బలక్ష్మీ, ఎం.వరలక్ష్మీ, విజయ పాల్గొన్నారు.

అల్లూరి విగ్రహాన్ని పరిశుభ్రపరచిన నాయకులు

ప్రత్తిపాడు, ఆగస్టు 12: ప్రత్తిపాడులో అల్లూరి విగ్రహాన్ని సోమవారం జిల్లా బీజేపీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ సింగిలిదేవ్ సత్తిరాజులు పరిశుభ్రం చేసి పూలమాలలు వేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో మన్యం ప్రజలకు అండగా అల్లూరి నిర్వహించిన పోరాటాలు మహోత్తరమైనవని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కిలిగడ్డ గంగరాజు, మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు కందా వీరాస్వామి, ఊటా వీరబాబు, రామకుర్తి సూర్యనారాయణ, ఊటా లక్ష్మీభాస్కరరావు, కూరాకుల రాజా, సతివాడ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపినవారిపై కేసులు

కాకినాడ క్రైం, ఆగస్టు 12: మద్యం తాగి వాహనాలు నడిపిన 34మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. కాకినాడ ట్రాఫిక్-1, ట్రాఫిక్-2 పోలీస్‌స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహించారు. మద్యం తాగి పట్టుబడిన వారిని 3వ స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి వి.నరసింహారావు 10మంది వాహనదారులకు రెండేసి రోజుల జైలు శిక్ష విధించారు. 24మందికి రూ.10వేల వంతున రూ.2.40 లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

న్యాయం చేయాలని వినతి

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 12: తమకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌ను సంపర మాజీ ఎమ్మెల్యే అనిశెట్టి బుల్లెబ్బాయిరెడ్డి రెండో భార్య కుమార్తె అనిశెట్టి దేవి కోరారు. ఈ మేరకు కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం డీఆర్‌వో తిప్పేనాయక్‌కు వినతి పత్రం అందజేశారు. తమకు న్యాయ ప్రకారం రావాల్సిన ఆస్తులను మొదటి భార్య కుమారుడు కాజేసేందుకు చూస్తున్నారని ఆరోపించారు. తమ వివాదం తేలే వరకు ఆస్తి రికార్డుల్లో మార్పులు, చేర్పులు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ సిబ్బంది సామూహిక ప్రతిజ్ఞలు

సామర్లకోట, ఆగస్టు 12: డ్రగ్స్ ఫ్రీ ఇండియా సాధన నినాదంతో పెద్దాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో జీ.ఉషా ఆదేశాల మేరకు సామర్లకోట పట్టణం, మండల పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం అంగన్‌వాడీ సిబ్బంది సామూహిక ప్రతిజ్ఞలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల సంభవించే దుష్పరిణామాలను వివరించారు. అంగన్‌వాడీ సిబ్బంది బీఎస్.రత్న కుమారి, బాలప్రభ, సీతా రత్నం, శార్వాణీ, పద్మ, మంగతాయారు పాల్గొన్నారు.

వర్షం వస్తే బురదమయం!

తాళ్లరేవు, ఆగస్టు 12: తాళ్లరేవు మండలం పి.మల్లవరం సరిహద్దు 4రోడ్ల జంక్షన్‌లో జిల్లా ప్రజాపరిషత్ రహదారి వర్షం కురిస్తే చాలు బురదమయం అవుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ఈ రహదారి మీదుగా స్కూల్‌కి వెళ్లే విద్యార్థులు బురదలో పడిపోయి ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలపై వెళ్తున్న ప్రయాణికులపై బురద పడుతుందని, ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. అలాగే తాళ్లరేవు చెరువుగట్టు సెంటరులో రోడ్డుపై వర్షంనీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నామని, ఉన్నతాధికారులు డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పి.మల్లవరంలో రహదారి గుంతల్లో బురదనీరు



తాళ్లరేవు చెరువుగట్టు సెంటర్‌లో రోడ్డుపై వర్షంనీరు

ప్రత్తిపాడు విచ్చేసిన హోం మంత్రి



మంత్రి అనితతో భేటీ అయిన ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, ఆగస్టు 12: రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనితకు ప్రత్తిపాడులో ఘన స్వాగతం లభించింది. స్థానిక టీడీపీ కార్యాలయానికి విచ్చేసిన అనితకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం వరుపుల స్వగృహంలో హోం మంత్రి అనిత, సత్యప్రభలు భేటీ అయి నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అనిత సత్యప్రభ కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, శంఖవరం మండలాలకు చెందిన పాఠశాలలకు నూతనంగా జరిగిన విద్యాకమిటీ ఎన్నికల్లో గెలుపొందిన వారు సోమవారం ఎమ్మెల్యే సత్యప్రభను కలిసి పూలమాలలు బొకేలతో అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ కాకినాడ పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షులు కొమ్ముల కన్నబాబు, నియోజకవర్గ సీబీఎన్ఆర్మీ కో ఆర్డినేటర్ యాళ్ల జగదీష్, చినశంకర్లపూడి టీడీపీ నాయకుడు మిరియాల శ్రీను తదితరులున్నారు.

రౌతులపూడి: మండలంలోని నూతనంగా ఎంపికైన పాఠశాలల విద్యాకమిటీ చైర్మన్లు యగదాసు హరిబాబు, పలువురు ప్రత్తిపాడులో ఎమ్మెల్యే సత్యప్రభను కలిశారు.

తహశీల్దార్ల బాధ్యతల స్వీకరణ

తొండంగి, ఆగస్టు 12: తొండంగి తహశీల్దార్‌గా మురార్జీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ రూరల్ మండల తహశీల్దార్‌గా పనిచేసిన ఆయన బదిలీపై తొండంగి రాగా మండల రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు కలిసి అభినందనలు తెలిపారు.

తుని రూరల్: తుని తహశీల్దార్‌గా జీవీఎస్.ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. పశ్చిమగోదావరి జిల్లా పోలవరం నుంచి తునికి బదిలీ అయి బాధ్యతలు చేపట్టారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేశారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు తహశీల్దార్‌గా ఎం.సూర్యప్రభ బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం నుంచి బదిలీపై ఆమె ఇక్కడకు వచ్చారు. సూర్యప్రభకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

జగ్గంపేట తహసీల్దార్‌గా జేఈఆర్ రమేష్

జగ్గంపేట: జగ్గంపేట తహశీల్దార్‌గా జేవీఆర్ రమేష్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ నాగేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ రామిరెడ్డి, రెవెన్యూ సిబ్బంది అభినందించారు.

కిర్లంపూడి: కిర్లంపూడి నూతన తహశీల్దార్‌గా ఎ.చిరంజీవి బాధ్యతలు స్వీకరించారు. గండేపల్లి తహశీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఆయనకు రెవెన్యూ సిబ్బంది స్వాగతంపలికి శుభాకాంక్షలు తెలిపారు.

శంఖవరం: శంఖవరం తహశీల్దార్‌గా ఎస్.పోతురాజు బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు వీఆర్వోలు, గ్రామ సర్వేర్లు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

ఏవోగా బాధ్యతల స్వీకరణ

కాకినాడ సిటీ, ఆగస్టు 12: కాకినాడ ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారిగా పితాని త్రినాథ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత కార్యాలయంలో ఆర్డీవో ఇట్ల కిషోర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తన చాంబర్‌లో ఏవోగా త్రినాథ్ బాధ్యతలు చేపట్టారు. పిఠాపురం తహశీల్దార్‌గా, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన ఇటీవల తహశీల్దార్ల బదిలీల్లో ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారిగా నియమితులయ్యారు.

సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ



గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా తరగతుల్లో సర్పంచ్‌లు, అధికారులు

పెద్దాపురం/ప్రత్తిపాడు/కిర్లంపూడి/ఏలేశ్వరం/సామర్లకోట/కొత్తపల్లి/గొల్లప్రోలు రూరల్/పిఠాపురం రూరల్, ఆగస్టు 12: జిల్లాలో పలుచోట్ల ఎంపీడీవో కార్యాలయాల్లో సోమవారం నుంచి 3రోజులపాటు గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించే శిక్షణా కార్యక్రమాలను ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించే దిశగా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని సూచించారు. పారిశుధ్యం, తాగునీరు, మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలన్నారు. నిధులు, విధులు తదితర విషయాలపై వారికి అవగాహన కల్పించారు. పెద్దాపురం, ప్రత్తిపాడు, కిర్లంపూడి, ఏలేశ్వరం, సామర్లకోట, కొత్తపల్లి, గొల్లప్రోలు, పిఠాపురంతో పాటు పలుచోట్ల ఈ సమావేశాలు జరిగాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిఠాపురం, ఆగస్టు 12: పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ పెద్దాపురం ఈఈ ఏవీఎస్ డీఎస్ ప్రభాకర్ సోమవారం తెలిపారు. పిఠాపురం సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 11కేవీ దత్తాత్రేయ ఫీడర్‌పై విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకూ ఆర్టీసీ కాంప్లెక్స్, సూరవరపు వారి వీధి, రజకవీధి, సాయిబాబు గుడి, చర్చి సెంటర్, ఎస్‌బీఐ సెంటర్, మెయిన్‌రోడ్డు, కోటగుమ్మం, ఉప్పాడ సెంటర్, పాతబస్టాండు, మిరపకాయల వీధి, అంబేడ్కర్ సెంటర్, శిష్టికరణాల వీధి, రాజుగారి వీధి, ఇందిరానగర్, రైల్వేస్టేషన్ రోడ్డు, స్టువర్టుపేట, రాపర్తి రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు క్రీడలు దోహదం

పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న చినరాజప్ప

పెద్దాపురం, ఆగస్టు 12: ఉజ్వల భవిష్యత్తుకు క్రీడలు ఎంతగానో దోహద పడతాయని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక జవహర్ నవోదయాలో 3రోజులపాటు నిర్వహించనున్న రీజినల్ లెవెల్ కబడ్డీ పోటీలను ఆయన సోమవారం ప్రారంభించారు. ముందుగా జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడల పట్ల ప్రతీ ఒక్కరూ మక్కువను పెంచుకోవాలని, క్రీడలతోనే శారీర ధారుడ్యం పెంపొందుతుందన్నారు. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడు, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరి తదితర రాష్ట్రాల నుంచి సుమారు 550 మంది క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజాసూరిబాబురాజు, నవోదయా ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య, పరశురామయ్య, జగన్మోహనరావు, సుధీర్‌కుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

శతాబ్దిపార్కు పరిశీలన

పెద్దాపురం- జగ్గంపేట ప్రధాన రహదారిలో ఉన్న శతాబ్ది పార్కును ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పరిశీలించారు. ఈనెల 15న పార్కును ప్రారంభించేందుకు జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజప్ప ఇంట వేడుకలు

సామర్లకోట, ఆగస్టు 12: పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్ జన్మదినం పురస్కరించుకుని సోమవారం అచ్చంపేటలోని ఎమ్మెల్యే స్వగృహంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు రాజాసూరిబాబు రాజు, తుమ్మల బాబు, విత్తనాల వెంకటరమణల ఆధ్వర్యంలో కార్యకర్తలు వేడుకలు నిర్వహించారు. రాజప్ప కేక్ కట్‌చేసి రంగనాగ్‌కు అందజేశారు. జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, బీజేపీ ఇంచార్జి వెంకటరమణ రంగనాగ్‌ను పూలమాలలతో అభినందించారు.ఆత్మీయవిందు జరిగింది.

15 నుంచి అన్న క్యాంటీన్‌లు ప్రారంభం

కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి



అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కొండబాబు

కాకినాడ సిటీ, ఆగస్టు 12: నిరుపేదలకు రూ.5కు భోజనం పెట్టడమే అన్న క్యాంటీన్ లక్ష్యమని, ఈనెల 15 నుంచి అన్న క్యాంటీన్‌లు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నాయని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తెలిపారు. కాకినాడ జగన్నాథపురం అన్నమ్మఘాటీ సెంటర్‌లో అన్న క్యాంటీన్‌ను సోమవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదవాడి ఆకలి తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15న రాష్ట్రవ్యాప్తంగా 100 అన్నక్యాంటీన్‌లు ప్రారంభిస్తోందన్నారు. నగరంలో 5 క్యాంటీన్‌లు వాడుకలోకి రానున్నాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లిపూడి వీరు, పాలిక నాని, గెడ్డం పూర్ణ చంద్రశేఖర్, మేడిశెట్టి చిన్ని, పెదపూడి కుమార్, పీర్ల లక్ష్మీ ప్రసన్న, సంగాని నాగూర్ తదితరులు ఉన్నారు.

పిఠాపురం, తునిలో క్యాంటీన్లు సిద్ధం

పిఠాపురం/తుని రూరల్, ఆగస్టు 12: పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న అన్నక్యాంటీన్ భవనాన్ని ఆధునీకరించారు. ఈ అన్నక్యాంటీన్‌ను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రారంభించే అవకాశం ఉంది. తునిలో సరికొత్త హంగులతో సుమారు రూ.10లక్షలు ఖర్చు చేసి అన్న క్యాంటీన్లను సర్వాంగ సుందరంగా సిద్ధం చేశారు.

జగ్గంపేటలో అన్న క్యాంటీన్

జగ్గంపేట, ఆగస్టు 12: కాకినాడ రోడ్‌లో గల ఎన్టీఆర్ విగ్రహం వద్ద సోమవారం టీడీపీ ఆధ్వర్యంలో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ఉచిత అన్న క్యాంటీన్‌లో జగ్గంపేట నియోజకవర్గం బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వేములకొండ జోగారావు కుమారుడు చైతన్య ఆర్థిక సహాయంతో అన్నా క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ అప్పలరాజు, నాయకులు మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, దాపర్తి సీతారామయ్య, రాయి సాయి, యు రామారావు, కేవీమూర్తి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతీఒక్కరూ కృషి

జేఎన్టీయూకే ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణ



మొక్కను నాటి నీరు పోస్తున్న వీసీ

జేఎన్టీయూకే, ఆగస్టు 12: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని జేఎన్టీయూకే ఇన్‌ఛార్జి వీసీ ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. ఏపీ జీవవైవిధ్యమండలి, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జేఎన్టీయూకే సెనేట్‌హాల్లో 6 నుంచి ఇంటర్మీడియట్ వరకూ విద్యార్థులకు వక్తృత్వం, డిబేట్, లఘుచిత్రాల పోటీలను సోమవారం జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. వీసీ మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జీవవైవిధ్యమండలి ప్రాంతీయ సమన్వయకర్త సత్యప్రసాద్, జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్, ఏపీఎన్జీసీ సమన్వయకర్త కేవీకే మహేశ్వరరావు, క్లస్టర్ కోఆర్డినేటర్లు కిరణ్ కుమారి, ఎన్‌వీబీ రావు, కేవీబీ రావు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి 208 మంది విద్యార్థులు హాజరయ్యారు. క్యాంపస్‌లో యూసీఈకే ఎన్‌సీసీ ఆధ్వర్యంలో తల్లి పేరు మీద ఒక చెట్టు అనే నినాదంతో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించగా ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. రెక్టార్ కేవీరమణ, ప్రిన్సిపాల్ ఎస్.మోహన్‌రావు, ఎన్‌సీసీ అధికారి బల్వాన్ సింగ్, క్యాడెట్లున్నారు.

ప్రతీ సమస్యను పరిష్కరించాలి : కమిషనర్



ఫిర్యాదును పరిశీలిస్తున్న కమిషనర్

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 12: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా వచ్చిన ప్రతీ సమస్యను సత్వరమే పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఆమె నిర్వహించారు. డయల్ యువర్ కమిషనర్ ద్వారా ఇంజనీరింగ్, ప్రజారోగ్యం, టౌన్‌ప్లానింగ్, యూపీఏ విభాగాలకు సంబంధించి 15 మంది ఫోన్ ద్వారా సమస్యలు విన్నవించారు. వివిధ అంశాలపై 23 వినతులు కమిషనర్‌కు అందాయి. కాకినాడ జీజీహెచ్ ఎదుట నాన్‌స్టాప్ బస్టాండ్‌వద్ద పబ్లిక్ టాయిలెట్స్ మెరుగుపరచాలని కోరుతూ శ్రామిక మహిళా కన్వీనింగ్ కమిటీ జి.బేబిరాణి, చంద్రమల్ల పద్మ ఆధ్వర్యంలో కమిషనర్‌కు వినతి అందజేశారు. సర్వరాయ షుగర్స్ లిమిటెడ్ బాటిలింగ్ యూనిట్ వేమగిరి ఆధ్వర్యంలో కోకో కోలా కంపెనీ అందజేసిన బయోక్రక్స్ ప్లాస్టిక్ వాషింగ్ మిషీన్‌ను సోమవారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. మెషీన్‌ను కమిషనర్ భావన ప్రారంభించారు. పారిశుధ్య నిర్వహణ తనిఖీల్లో భాగంగా కమిషనర్ నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈనెల 15న అన్నక్యాంటీన్లు ప్రారంభించనున్న నేపథ్యంలో వివేకానంద పార్కు వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను ఆమె పరిశీలించారు.

ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ బహిష్కరణ

ఎంఈవోలకు యూటీఎఫ్ వినతులు

గొల్లప్రోలు, ఆగస్టు 12: ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియను బహిష్కరిస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ప్రకటించారు. ఈ మేరకు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్ సూరిబాబు, గొల్లప్రోలు మండలశాఖ ప్రధాన కార్యదర్శి దాడి పద్మనాభం, సంక్షేమ పథక జిల్లా కోశాధికారి ఏ.సీతారామరాజు తదితరులు సోమవారం గొల్లప్రోలు ఎంఈవో వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలు ప్రస్తావించిన అంశాల్లో ఏ ఒక్కటిని పరిగణలోకి తీసుకోకుండా విద్యాశాఖ ఏకపక్షంగా సర్దుబాటు ప్రక్రియను చేపట్టడాన్ని వ్యతిరేకిస్తున్నట్టు, ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఫ్యాప్టో పిలుపుమేరకు అన్ని మండలాల్లో కౌన్సిలింగ్‌ను బహిష్కరిస్తున్నట్టు చెప్పారు.

సామర్లకోటలో...

సామర్లకోట: ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మండల యూటీఎఫ్ నాయకులు సోమవారం సామర్లకోట ఎంఈవో వై.శివరామకృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. యూటీఎఫ్ నాయకులు ఎస్వీ.రామారెడ్డి, ఎంబీఎస్.దేవి, నక్కిన నాగరాజు, వి.సుబ్రహ్మణ్యం తదితరులున్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన



విద్యార్థులకు వివరిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందం

తాళ్లరేవు, ఆగస్టు 12: తాళ్లరేవు జిల్లాప్రజాపరిషత్ హైస్కూల్ నందు సోమవారం తహశీల్దార్ ఎమ్.సూరిబాబు, ఎన్‌డీఆర్ఎఫ్ ఇనస్పెక్టర్ మన్మమోహన్‌సింగ్ యాదవ్ ఆధ్వర్యంలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందం ప్రకృతి వైపరీత్యాలు, బిల్డింగులు కూలిపోవడం, అగ్నిప్రమాదాలు, వరదలు, సునామిలు, భూకాంపాలు, సీపీఆర్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విజయవాడ 10వ బెటాలియన్ ఎన్‌డీఆర్ఎఫ్ బృందం 20మంది సిబ్బంది కాకినాడ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 15రోజులు పాటు స్కూల్స్ విద్యార్థులకు ప్రకృతి విపత్తులపై అవగాహన కల్పిస్తున్నట్టు మన్మహన్‌సింగ్ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, ప్రధానోపాధ్యాయురాలు ఆశాలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాహనం చోరీ

కొత్తపల్లి, ఆగస్టు 12: ఉదయం 11గంటల సమయంలో మెయిన్‌రోడ్డు పక్కన పార్క్ చేసిన యాక్టివా వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. వాకతిప్ప రామాలయం సెంటర్లో ధాన్యం మిల్లు నడిపే గుండుబోయిన మహేష్ తన యాక్టివా వాహనాన్ని మెయిన్‌రోడ్డుపక్కన పార్క్ చేసి మిల్లులోకి వెళ్లి వెళ్లాడు. మిల్లులో పనిచూసుకుని 10 నిమిషాల తర్వాత వచ్చి చూడగా యాక్టివా కనిపించకపోవడంతో చుట్టు పక్కల ఆరా తీరాడు. ఆదే సమయంలో ఉప్పాడ నుంచి ఇద్దరు కుర్రాళ్లు నడిచి వెళ్తూ మిల్లు వద్ద పార్కింగ్ చేసిన యాక్టివా వాహనంపై పారిపోవడం దగ్గర్లో ఉన్న ఇంటి సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. సీసీ ఫుటేజీ ఆధారంగా కొత్తపల్లి పోలీసులకు మహేష్ ఫిర్యాదు చేశాడు.

తామరాడలో పాల వితరణ

కిర్లంపూడి, ఆగస్టు 12: మండలంలోని తామరాడలో ప్రజా పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా ఎన్నికైన విద్యాకమిటీ చైర్మన్ గోనేడ ప్రసాద్ సోమవారం పిల్లలకు పాల వితరణ చేపట్టారు. కార్యక్రమానికి జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, రామచంద్రపురం సర్పంచ్ తుమ్మలపల్లి సాయిగుణశేఖర్ హాజరయ్యారు. కార్యక్రమంలో తామరాడ గ్రామ సర్పంచ్ తోట అయ్యన్న, ఎంపీటీసీ గోకేడ రాజా, విద్యాకమిటీ చైర్మన్ ఎలుగుబంటి శ్రీను, మాదారపు వీరబాబు, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం

రౌతులపూడి, ఆగస్టు 12: గిడజాం గ్రామంలో సోమవారం పాయకరావుపేటకు చెందిన నేత్రాలయం ఆసుపత్రి ఆధ్వర్యంలో ఎన్డీయే నాయకుల సమక్షంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 60మందికి కంటి పరీక్షలు నిర్వహించి 20 మందిని ఆపరేషన్లకు గుర్తించారు. తండపురెడ్డి అప్పారావు,మాజీ ఎంపీటీసీ తండపురెడ్డి వెంకరమణ పాల్గొన్నారు.

మహనీయుల చిత్రపటాలు అందజేత

ప్రత్తిపాడు, ఆగస్టు 12: స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ధర్మవరంలో హైస్కూల్ సిబ్బందికి గాంధీ, నెహ్రూ, పటేల్, భగత్‌సింగ్, సర్వేపల్లి రాధాకృష్ణ, అబ్దుల్‌కలాం, అంబేడ్కర్ వంటి మహనీయుల చిత్రపటాలను స్థానిక ఫొటోగ్రాఫర్ నక్కా శ్రీను అందజేశారు.

మాలమహానాడు నాయకుల నిరసన

కిర్లంపూడి, ఆగస్టు 12: ఎస్సీ రిజర్వేషన్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కుట్రలను తిప్పికొడతామని మాలమహానాడు నాయకులు హెచ్చరించారు. సోమవారం కిర్లంపూడి ఎస్సీపేట వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేసి అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేశారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ

ఏలేశ్వరం, ఆగస్టు 12: మండలంలోని భద్రవరం, పేరవరం, యర్రవరం, సిరిపురం, తిరుమాలి, పెద్దనాపల్లి, గ్రామాల్లో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో శ్రీసర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను విద్యార్థులకు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి పంపిణీ చేశారు. కొప్పుల బాబ్జి, జిగటాపు సూరిబాబు, బస్వా ప్రసాద్, కొల్లా శ్రీనివాస్ ఉన్నారు.

రంగనాథన్ జయంతి

కాకినాడ సిటీ, ఆగస్టు 12: భారతదేశ గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డాక్టర్ పద్మశ్రీ ఎస్ఆర్ రంగనాథన్ జయంతి కార్యక్రమాన్ని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సోమవారం నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కేంద్ర ఇన్‌చార్జి ఉప గ్రంథాలయ అధికారి కె.కిషోర్, జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉద్యోగులు ఎస్.రాజు, టి.వీర్రాజు, ఏవీఎస్ నాగేంద్రకుమార్, వి.అరుణ పాల్గొన్నారు.

యనమల పరామర్శ

కోటనందూరు, ఆగస్టు 12: టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు సోమవారం మండలంలో పర్యటించారు. బిల్లనందూరులో టీడీపీ సీనియర్ నాయకుడు, నూకరాజు నాయుడు అనారోగ్యానికి గురికావడంతో పరామర్శించారు. ఎస్ఆర్‌పేటలో సింగంపల్లి అచ్చియ్యనాయుడు, జగన్నాధపురం గుడివాడ పాములు, మాజీ వార్డు మెంబర్ మాతిరెడ్డి మహాలక్ష్మి కుటుంబాలను పరామర్శించారు. యనమల రాజేష్, సుర్ల లోవరాజు, గాడి రాజుబాబు, మోత్కూరి వెంకటేష్, గొర్లి అచ్చియ్యనాయుడు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన పావని



కాకినాడ సిటీ, ఆగస్టు 12: ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని, తిరుమలకుమార్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు చేపడుతున్న పార్టీ కార్యక్రమాలను ఆయనకు వివరించారు.